TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &chief editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 12 బుధవారం 12-08-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వెల :2.00/-

## ఏటా వెయ్యి కోట్ల గుడ్లు వృథా..

-భారత్‌పై ఎన్ఈసీసీ నివేదిక వెల్లడి

-ఒకరు ఏడాదికి సగటున తినేవి 101



**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**

భారతదేశంలో గుడ్ల వినియోగం, ఉత్పత్తిపై వెలువడిన నివేదిక పలు ఆసక్తికర వివరాలను వెల్లడించింది. నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ(ఎన్ఈసీసీ) ప్రజల్లో గుడ్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నది. 25 వేల మందికిపైగా పౌల్ట్రీ రైతులు సభ్యులుగా ఉన్న ఎన్ఈసీసీ రోజువారీ గుడ్డు ధరలను నిర్ణయించడంలో కీలక ప్రాత్ర పోషిస్తున్నది. ప్రస్తుతం భారత పౌల్ట్రీ రంగం సుమారు రూ.1,14,000 కోట్ల విలువతో ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌లలో ఒకటిగా ఎదిగింది.ఏటా 13,800 కోట్ల గుడ్లను ఉత్పత్తి చేస్తూ, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద గుడ్ల ఉత్పత్తిదారుగా నిలిచింది. అయితే ఇందులో 11,000 కోట్ల గుడ్లు మాత్రమే వినియోగదారులకు అందుతున్నాయి. రవాణా లోపాల కారణంగా ఏటా 1,000 కోట్ల గుడ్లు వృథా అవుతున్నాయని 'ఇంక్-42' తన అధ్యయనంలో తెలిపింది. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలు గుడ్ల ఉత్పత్తిలో ముందున్నాయి. ఒక భారతీయుడు ఏడాదికి సగటున 101 గుడ్లను మాత్రమే తింటున్నాడు. ఇది ప్రపంచ సగటు కంటే 44 శాతం తక్కువ.



# ఢిల్లీకి ఉగ్ర ముప్పు

- అలర్ట్ చేసిన ఇంటెలిజెన్స్
- అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం
- బంగ్లా, పాక్ బోర్డర్లలో మరింత నిఘా
- ఢిల్లీ, జమ్మూకాశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం
- సరిహద్దుల గుండా చొరబాట్లకు అవకాశం
- టైర్-2 నగరాలపై కూడా ఉగ్రవాదుల దృష్టి
- తప్పుడు హెచ్చరికలతో దృష్టి మళ్లించే వ్యూహం
- పాక్ సరిహద్దులో 'ఆపరేషన్ అలర్ట్' అమలు

**స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఉగ్ర ముప్పుపై హెచ్చరికలు**

02

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు దేశంలోని కీలక ప్రాంతాలను టార్గెట్ చేసే ప్రమాదం ఉందన్న సమాచారంతో పాక్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తూ ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టింది



## 3.43 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు

- 15న సంగారెడ్డిలో లక్ష మందితో భారీ బహిరంగ సభ
- జనసమీకరణ, భద్రత, వేదిక ఏర్పాట్లపై ఫోకస్
- ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

**హైదరాబాద్**

పంద్రాగస్టు రోజు సంగారెడ్డి పట్టణంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనసమీకరణ, భద్రత, వేదిక తదితరాంశాలపై ఫోకస్ పెట్టింది. ఇదే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లతోనూ మంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండటం వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం

-మిగతా 2 లో

## పాతబస్తీ మెట్రో పనుల్లో

# వేగం పెంచాలి

వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి



- ఎంజీబీఎస్--చాంద్రాయణగుట్ట కారిడార్‌పై ప్రత్యేక దృష్టి
- రోడ్డు విస్తరణ, భూసేకరణ పనులు పూర్తి చేయాలి
- పెరుగుతున్న రద్దీకి కొత్త కోచ్‌ల కొనుగోలు
- ప్రయాణికుల కోసం అదనపు బోగీల ఏర్పాటు
- ఫేజ్-2 పనులకు ఢిల్లీ మెట్రో సలహాలు
- మెట్రో విస్తరణపై ఉన్నతస్థాయి సమీక్ష
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- పెట్టుబడుల ఆకర్షణకు అంతర్జాతీయ ప్రమాణాల ఏర్పాట్లు
- గత సమ్మిట్ ఫలితాలపై నివేదిక కోరిన సీఎం
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

**హైదరాబాద్**

హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్)కు సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు మంగళవారం సీఎం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కారిడార్ లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని సూచించారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకు రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా

-మిగతా 2 లో



02

టీఎంసీకి సుప్రీంకోర్టులో

## ఎదురుదెబ్బ

- బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై ఊరట నిరాక
- ఈడీ చర్యలకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్
- కలకత్తా హైకోర్టు తీర్పుకు మద్దతు
- రూ.440 కోట్ల నిధులపై కొనసాగుతున్న ఆంక్షలు
- మనీ లాండరింగ్ కేసులో వేగంగా విచారణ
- రోజువారీ ఖర్చులకు మాత్రమే పరిమిత అనుమతి
- నిధుల మళ్లింపుపై ఈడీ కీలక ఆరోపణలు
- విమానం, హెలికాప్టర్ కొనుగోళ్లపై అనుమానాలు
- ఆరు ఖాతాలు ఫ్రీజ్.. మూడింటికి టీఎంసీ సంబంధం

## అరుణాచల్‌ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే

- చైనా వ్యాఖ్యలకు భారత్ గట్టి సమాధానం
- 'వాస్తవాన్ని ఎవరూ మార్చలేరు' అంటూ స్పష్టీకరణ
- సరిహద్దు శాంతి ద్వైపాక్షిక సంబంధాలకు కీలకం
- ఎల్ఏసీ వెంట పరిస్థితులపై భారత్-చైనా సమీక్ష
- పెండింగ్ సమస్యల పరిష్కారానికి దౌత్య, సైనిక మార్గాలు
- డబ్ల్యూఎంసీసీ, కమాండర్ స్థాయి చర్చలు కొనసాగింపు

02





## ప్రయివేటు నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలి

- నర్సుల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన స్పందన
- హాస్పిటల్ యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చించాలని డిమాండ్
- హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడం బాధాకరం
- సిబ్బంది సంక్షేమంపై యాజమాన్యాల నిర్లక్ష్యమా?
- పని వేళలు, జీతాల అంశాల్లో నర్సుల ఆందోళనలు
- స్థానిక ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్
- ప్రైవేట్ ఆస్పత్రులకు స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం
- నర్సుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
- ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బందికి అండగా ఉంటామన్న కవిత

హైదరాబాద్

ప్రయివేటు ఆస్పత్రుల్లో పని చేసే నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవటం బాధకరమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర కార్యాలయంలో తనను కలిసిన ప్రయివేటు హాస్పిటల్స్ నర్సులతో ఆమె మాట్లాడారు.

-మిగతా 2 లో



పాలిమర్ కరెన్సీ నోట్లకు

## కేంద్రం గ్రీన్ సిగ్నల్

- రూ.10, రూ.20 నోట్లపై ప్రయోగాత్మక అమలు
- ఒక్కో డినామినేషన్‌లో 100 కోట్ల నోట్లు జారీ
- ఆర్‌బీఐ సిఫార్సుతో ముందడుగు వేసిన కేంద్రం
- విజయవంతమైతే దేశవ్యాప్తంగా విస్తరణకు అవకాశం
- కాగితపు నోట్లకు ప్రత్యామ్నాయం కాదన్న ప్రభుత్వం
- ప్రాథమిక దశలోనే పాలిమర్ నోట్ల సేకరణ ప్రక్రియ
- అమలు తేదీ, వ్యయంపై ఇంకా స్పష్టత లేదు
- ఎక్కువ కాలం మన్నే నోట్లపై ప్రభుత్వ దృష్టి
- అంతర్జాతీయ అనుభవాల ఆధారంగా కొత్త ప్రయోగం

02

## సర్ పేర అర్హుల ఓట్ల తొలగింపుపై

# పోరాటం

దాదాపు 74 లక్షల ఓట్లు తొలగించే అవకాశం

- అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడేందుకు చర్యలు
- కొండల్‌రెడ్డికి భూకేటాయింపులపై సమగ్ర విచారణ జరపాలి
- టెస్సరాక్ట్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయింపా?
- వాస్తవాలు తేలేవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్**

సర్ ప్రక్రియలో అర్హులైన కొంతమంది ఓటర్ల పేర్లు తొలగించబడుతున్నట్టు కనిపిస్తోందనీ, అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా న్యాయపరంగా, పార్టీ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) స్పష్టం చేశారు. అర్హులైన ఓట్లు తొలగించకుండా పోరాటం చేస్తామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సర్ కమిటీతో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో మొత్తం 3.39 కోట్ల ఓట్లు ఉన్నాయని చెప్పారు. అందులో దాదాపు 74 లక్షల ఓట్లు 'అన్‌కలెక్టబుల్'గా ఉన్నాయనీ, వాటి నుంచి ఇప్పటివరకు స్పందన

-మిగతా 2 లో



## నేడు అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం

- 55 దేశాల్లో కనిపించనున్న ఖగోళ అద్భుతం
- భారత్‌లో మాత్రం కనిపించని సూర్యగ్రహణం
- 1999 తర్వాత ఐరోపాలో అరుదైన దృశ్యం
- సూర్యుడు--చంద్రుడు--భూమి ఒకే సరళరేఖలో
- చంద్రుడు పూర్తిగా కప్పేస్తేనే సంపూర్ణ గ్రహణం
- ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక వీక్షణ ఏర్పాట్లు
- ఆకాశంలో అద్భుత దృశ్యానికి కౌంట్‌డౌన్

02



# ఢిల్లీకి ఉగ్ర ముప్పు

-స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఉగ్ర ముప్పుపై హెచ్చరికలు
- అలర్ట్ చేసిన ఇంటెలిజెన్స్
- అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం
- బంగ్లా, పాక్ బోర్డర్లలో మరింత నిఘా
-ఢిల్లీ, జమ్మూకాశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం
-సరిహద్దుల గుండా చొరబాట్లకు అవకాశం
-టైర్-2 నగరాలపై కూడా ఉగ్రవాదుల దృష్టి
-తప్పుడు హెచ్చరికలతో దృష్టి మళ్లించే వ్యూహం
-పాక్ సరిహద్దులో 'ఆపరేషన్ అలర్ట్' అమలు



న్యూఢిల్లీ,
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడవచ్చన్న సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేస్తూ కీలక చర్యలు చేపట్టింది. ఆగస్టు 15న ఢిల్లీ, జమ్మూకాశ్మీర్ వంటి ప్రాంతాల్లో భద్రతా బలగాల దృష్టి వేడుకలపై కేంద్రీకృతమై ఉంటుందని, ఇదే అదునుగా దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ భావిస్తున్నదని 'ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఐబీ) అధికారి ఒకరు తెలిపారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే), బలూచిస్తాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఐఎస్ఐ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు నిఘావర్గాలు అంచనా వేస్తున్నాయి. జమ్మూకాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను చొరబడేలా చేయడం, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా పంపడం వంటి ప్రయత్నాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా, భద్రత తక్కువగా ఉండే టైర్ 2 నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉంది. కొన్నిసార్లు భద్రతా ఏజెన్సీల దృష్టిని పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ లేదా కాశ్మీర్‌లో దాడులంటూ తప్పుడు సమాచారం సృష్టించి, మరోచోట దాడికి దిగే వ్యూహం కూడా ఐఎస్ఐ అనుసరించవచ్చని ఓ అధికారి వివరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో పాకిస్తాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) 'ఆపరేషన్ అలర్ట్' ను ప్రారంభించింది. ఆగస్టు 10 నుంచి 17 వరకు కొనసాగే ఈ ఆపరేషన్‌ను బీఎస్ఎఫ్ సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తూ, నిఘా, పెట్రోలింగ్‌ను గణనీయంగా పెంచారు. మరోవైపు బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రతను పటిష్టం చేసేందుకు పశ్చిమబెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో సుమారు 40 'సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఎస్ఐబీ)' యూనిట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది.

# 3.43 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు



మొదటి తరువాయి

ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సంగారెడ్డి బహిరంగ సభను జయప్రదం చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. జన సమీకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. అదే రోజు ఏకకాలంలో అన్ని జిల్లాల్లో కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి మొత్తం పది మంది లబ్దిదారులకు సీఎం స్వయంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని తెలిపారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ఆదేశించారు. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది అర్హులైన లబ్దిదారులు ప్రయోజనం పొందనున్నారని చెప్పారు. ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ప్రతి అర్హుడికి ప్రతి నెలా ఆరు కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని తెలిపారు. సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఇందుకోసం సరఫరా చేస్తోందని చెప్పారు. స్మార్ట్ కార్డుల ద్వారా రాష్ట్రంలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఆహార భద్రతను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# సర్ పేర అర్హుల ఓట్ల తొలగింపుపై పోరాటం

మొదటి తరువాయి

రాలేదని ఎన్నికల కమిషన్ చెప్తోందన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు అన్‌కలెక్టబుల్‌గా ఉండటం, వాటిలో చాలా ఓట్లు తొలగించబడే అవకాశం ఉందనే పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. సుమారు 60 లక్షల ఓట్లలో అనామలీస్ ఉన్నట్టు సమాచారం ఉందన్నారు. సర్ ప్రక్రియ పూర్తయ్యే నాటికి కేవలం రెండు కోట్ల ఓట్లు మాత్రమే ఎలాంటి సమస్యలు లేకుండా మిగిలే పరిస్థితి కనిపిస్తోందనీ, మిగిలిన ఓట్లలో కొన్ని తొలగిపోయే అవకాశం ఉందనీ, మరికొన్నింటిలో తప్పులు, అనుమానాలు ఉన్నట్టు ఎన్నికల కమిషన్ నుంచి సమాచారం వస్తోందని చెప్పారు. అర్హులైన వారి ఒక్క ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడటం అత్యంత ముఖ్యమని అన్నారు. ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని ఎన్నికల అధికారులు చెప్తున్నారని తెలిపారు. ఆ జాబితా ప్రచురణ అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. ఇప్పటికే పార్టీ లీగల్ సెల్‌తో సమావేశమై, న్యాయ నిపుణుల సలహాలు కూడా తీసుకున్నామని వివరించారు. రేపు, ఎల్లుండి కొన్ని సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నామని అన్నారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తో చర్చించిన అనంతరం ఆ సమావేశాల పూర్తి వివరాలు, కార్యాచరణను వెల్లడిస్తామన్నారు. జిల్లాల వారీగా జరిగే సమావేశాల్లో స్థానిక పరిస్థితులను సమీక్షించి, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

మొదటి తరువాయి

అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్ కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచ్ లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. డిసెంబర్ లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ డిసెంబర్ లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్ లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది నిర్వహించిన సమ్మిట్ లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అరుణాచల్‌ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే

-చైనా వ్యాఖ్యలకు భారత్ గట్టి సమాధానం
-'వాస్తవాన్ని ఎవరూ మార్చలేరు' అంటూ స్పష్టీకరణ
-సరిహద్దు శాంతి ద్వైపాక్షిక సంబంధాలకు కీలకం
-ఎల్‌ఏసీ వెంట పరిస్థితులపై భారత్-చైనా సమీక్ష
-పెండింగ్ సమస్యల పరిష్కారానికి దౌత్య, సైనిక మార్గాలు
-డబ్ల్యూఎంసీసీ, కమాండర్ స్థాయి చర్చలు కొనసాగింపు



న్యూఢిలీ
అరుణాచల్‌ప్రదేశ్ ఎప్పటికీ భారత్ లో అంతర్భాగమేనని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టంచేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొన్నది. ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ విధంగా స్పందించింది.విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టంచేశారు. భారత్-చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టంచేశారు. ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకార మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

# నేడు అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం

55 దేశాల్లో కనిపించనున్న ఖగోళ అద్భుతం
భారత్‌లో మాత్రం కనిపించని సూర్యగ్రహణం
1999 తర్వాత ఐరోపాలో అరుదైన దృశ్యం
సూర్యుడు--చంద్రుడు--భూమి ఒకే సరళరేఖలో
చంద్రుడు పూర్తిగా కప్పేస్తేనే సంపూర్ణ గ్రహణం
ఖగోళ ప్రేమికుల్లో ఉత్సాహం
ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక వీక్షణ ఏర్పాట్లు
శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షిస్తున్న ఖగోళ ఘటన
ఆకాశంలో అద్భుత దృశ్యానికి కౌంట్‌డౌన్



న్యూఢిల్లీ
ఈ నెల 12న అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. దీనిని సంపూర్ణంగా లేదా పాక్షికంగా దర్శించేందుకు పలు దేశాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇది భారత్‌లో కన్పించక పోయినా 55 దేశాల్లో కనిపిస్తుంది. సూర్యుడు, చంద్రుడు, భూమి ఒక సరళరేఖ పైకి వచ్చినప్పుడు చంద్రుడు.. సూర్యునికి, భూమికి మధ్యగా నేరుగా వెళ్లడం వల్ల మన గ్రహంపై నీడ పడుతుంది.సూర్యుడి కాంతిని కొంత లేదా పూర్తిగా చంద్రుడు అడ్డుకోవడాన్ని సూర్యగ్రహణం అంటారు. చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కప్పేస్తే సంపూర్ణ సూర్యగ్రహణం. 1999 తర్వాత ఐరోపా ప్రధాన భూ భాగంలో సంపూర్ణ సూర్యగ్రహణం కనిపించనుంది.

# ప్రయివేటు నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలి

మొదటి తరువాయి

వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రయివేటు హాస్పిటల్స్ యాజమాన్యాలు పెద్ద ఎత్తున ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. అయినా ఆయా హాస్పిటల్స్ లో పనిచేసే సిబ్బందికి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదని విమర్శించారు. కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ వాళ్లకు లేకపోవడం సరికాదన్నారు. వెంటనే ఈ విషయంపై ప్రభుత్వం ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి ఇన్సూరెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా పని వేళలు, జీతాలు, ఓవర్ టైమ్ వంటి అంశాల్లో తెలంగాణాకు చెందిన ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోని ప్రయివేటు హాస్పిటల్స్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రయివేటు ఆస్పత్రుల సిబ్బందికి, నర్సులకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# టీఎంసీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై ఊరట నిరాక
- ఈడీ చర్యలకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్
- కలకత్తా హైకోర్టు తీర్పుకు మద్దతు
- రూ.440 కోట్ల నిధులపై కొనసాగుతున్న ఆంక్షలు
- మనీ లాండరింగ్ కేసులో వేగంగా విచారణ
- రోజువారీ ఖర్చులకు మాత్రమే పరిమిత అనుమతి
- నిధుల మళ్లింపుపై ఈడీ కీలక ఆరోపణలు
- విమానం, హెలికాప్టర్ కొనుగోళ్లపై అనుమానాలు
- ఆరు ఖాతాలు ఫ్రీజ్.. మూడింటికి టీఎంసీ సంబంధం



న్యూఢిలీ
భారత సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ)కి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ బ్యాంక్ అకౌంట్లను నిలిపివేస్తూ ఈడీ తీసుకున్న నిర్ణయంపై నిషేధం ఎత్తివేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో కలకత్తా హైకోర్టు ఆదేశాలను సమర్థించింది. టీఎంసీ పార్టీపై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. ఈ కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ జరుపుతోంది. విచారణలో భాగంగా టీఎంసీ పార్టీకి చెందిన బ్యాంక్ అకౌంట్లను ఈడీ నిషేధించింది. పార్టీకి చెందిన మూడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అకౌంట్లను ఈడీ జూలై 7న నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం టీఎంసీకి సంబంధించిన బ్యాంక్ అకౌంట్లలో రూ.440 కోట్ల డబ్బు ఉంది.దీన్ని సవాల్ చేస్తూ ఈడీ.. కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. తమ బ్యాంక్ అకౌంట్లు తిరిగి నిర్వహించుకునేలా ఆదేశాలివ్వాలని కోరింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఈడీ నిర్ణయాన్ని సమర్థించింది. ఇదే సమయంలో పార్టీకి సంబంధించిన రోజువారీ ఖర్చులకు కొన్ని నిధులు వాడుకునేందుకు మాత్రం అనుమతించింది. ఇందుకోసం ప్రత్యేక అధికారిని కూడా నియమించింది. దీనిపై జూలై 20న ఆదేశాలిచ్చింది. కలకత్తా హైకోర్టు కూడా ఈడీ నిర్ణయాన్ని సమర్థించడంతో ఆ పార్టీ సుప్రీంకోర్టులో ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలే ఆధ్వర్యంలోని సుప్రీం బెంచ్ విచారణ జరిపింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల్ని సమర్థిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. టీఎంసీ బ్యాంక్ అకౌంట్లపై ఈడీ విధించిన నిషేధాన్ని ఎత్తివేసేందుకు నిరాకరించింది. ఈ విషయంలో కోల్‌కతా హైకోర్టు సమతూకంగా, బాధ్యతగా వ్యవహరించిందని అభిప్రాయపడింది. హైకోర్టు వ్యవహరించిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా సంస్థ సహా పలు సంస్థలకు ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2026 మధ్య నిధుల మళ్లింపు జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఒక విమానం, ఒక హెలికాప్టర్ కొనుగోలుకు సంబంధించిన వ్యవహారంలో అవకతవకలు జరిగినట్లు ఈడీ గుర్తించింది. దీనిలో భాగంగా గత నెలలో ఆరు బ్యాంక్ అకౌంట్లను ఈడీ ఫ్రీజ్ చేసింది. వాటిలో మూడు టీఎంసీకి సంబంధించినవి ఉన్నాయి.

# పాలిమర్ కరెన్సీ నోట్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

-రూ.10, రూ.20 నోట్లపై ప్రయోగాత్మక అమలు
-ఒక్కో డినామినేషన్‌లో 100 కోట్ల నోట్లు జారీ
-ఆర్‌బీఐ సిఫార్సుతో ముందడుగు వేసిన కేంద్రం
-విజయవంతమైతే దేశవ్యాప్తంగా విస్తరణకు అవకాశం
-కాగితపు నోట్లకు ప్రత్యామ్నాయం కాదన్న ప్రభుత్వం
-ప్రాథమిక దశలోనే పాలిమర్ నోట్ల సేకరణ ప్రక్రియ
-అమలు తేదీ, వ్యయంపై ఇంకా స్పష్టత లేదు
-ఎక్కువ కాలం మన్నే నోట్లపై ప్రభుత్వ దృష్టి
-అంతర్జాతీయ అనుభవాల ఆధారంగా కొత్త ప్రయోగం



న్యూఢిలీ
దేశంలో త్వరలో పాలిమర్ కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్ లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీచేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి (ఖీఱఅఖఅషవ వీఱఅఱర్‌వతీ) నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటుకు వెల్లడించారు.భారతీయ రిజర్వ్ బ్యాంక్ సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు 'ఆర్‌బీఐ చట్టం-1934' లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోనీ పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీచేసే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు నోట్ల స్థానంలో వీటిని తీసుకురావడం లేదని, వాటితో పాటే ఈ కొత్త నోట్లు కూడా అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టంచేసింది. అయితే పాలిమర్ నోట్ల సేకరణ ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆర్‌బీఐ పేర్కొన్నది. అందువల్ల వీటిని ఎప్పుడు ప్రవేశపెడతారు..? దీనికి ఎంత ఖర్చవుతుంది..? అనే విషయాలపై ఇప్పుడే కచ్చితమైన వివరాలు చెప్పలేమని తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే, కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## గాంధీ భవన్లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ గారితో ప్రత్యేకంగా సమావేశమైన టీపీసీసీ ఉపాధ్యక్షులు

**-కూకట్పల్లి పార్టీ ఇంచార్జ్,**

**కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ .**



కూకట్పల్లి నవ సంఘర్షణ

అధిష్టానం పిలుపు మేరకు బండి రమేష్ గాంధీభవన్ లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, SIR తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి గంప వేణుగోపాల్తో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా జరిగిన SIR కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ కీలకంగా వ్యవహరించిందని,ముఖ్యంగా కూకట్పల్లి నియోజకవర్గంలో బూత్ వారీగా దీూూ లను నియమించి సక్సెస్ చేశామని, సావంత్ గారికి వివరించారు.ప్రజలకు దగ్గర కావడానికి, దొంగ ఓట్లను గుర్తించడానికి దీూూ వ్యవస్థ బాగా ఉపయోగపడిందని బండి రమేష్ చెబుతూ కూకట్పల్లి SIR ప్రక్రియ విషయాలను సచిన్ తో పంచుకున్నారు . టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా, జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ , ప్రభుత్వ పథకాలు అర్హులకు అందే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు, రానున్న కార్పొరేషన్ ఎన్నికలకోసం సిద్ధంగా ఉన్నట్లు సచిన్ సావంత్ కి నివేదికలు అందించారు.

## రేవల్లి మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**- అధ్యక్షులుగా బాదేపల్లి రేవతి సురేష్ గౌడ్**



గోపాల్ పేట్ /రేవల్లి నవ సంఘర్షణ

రేవల్లి మండల కేంద్రంలోని స్థానిక సర్పంచ్ టప్ప రాజయ్యనివాసంలో రేవల్లి మండల సర్పంచుల సమావేశం జరిగింది. ఈ సమావేశం రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ సుల్తాన్ అలీ,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వాడల పర్వతాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షులు గా బాదేపల్లి రేవతి సురేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా టప్ప రాజయ్య ,ప్రధాన కార్యదర్శి గా సభావత్ శ్రీను, కోశాధికారి గా జి. పావని కార్యదర్శులు గా లోడే అంజలమ్మ శ్రీశైలం, పాంపురం రేణుక బాల్ నాగయ్య, బి.రాజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బాదేపల్లి రేవతి సురేష్ గౌడ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నా ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## అమ్మవారి బోనాల జాతరలో పాల్గొన్న బండి రమేష్



కూకట్పల్లి,: నవ సంఘర్షణ

శ్రీశ్రీశ్రీ తలుపులమ్మ తల్లి - నీలమణి దుర్గమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించిన అమ్మవారి బోనాల జాతర కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్చార్జ్, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనం సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక ప్రతీక అని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సంతోషం, ఆరోగ్యం కలగాలని బండి రమేష్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ప్రశాంతి నగర్ డివిజన్ ప్రెసిడెంట్ చందర్రావు, నాగార్జున, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, వాసు, రమణ, పాల్గొన రావు, కామినేని వాసు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శ్రమదానం

నవ సంఘర్షణ /ఎల్లారెడ్డిపేట మండలం)
ఆగస్టు-11



విద్యార్థులు సేవాభావం అలవరుచుకోవాలి విద్యార్థులు విద్యార్థి దశనుండే ఉత్తమ లక్షణాలను, సేవాభావంను అలవరుచుకోవాలనీ భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా,సామాజిక సేవకులుగా రాణిస్తారనీ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు అన్నారు.ఆగష్టు 11న ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు .ఈసందర్భంగా ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ,అందులో భాగంగానే ఈరోజు కళాశాలలో పరిశుభ్రతకోసం గడ్డి చెక్కి,చెత్త చెదారం తొలిగించడం జరిగిందనీ అన్నారు.విద్యార్థులు వాలంటీర్లుగా స్వయంగా పాల్గొనడం ద్వారా శ్రమ విలువ తెలుసుకోవడంతోపాటు,శ్రమను గుర్తిస్తారనీ, ఉత్తమ పౌరులుగా రాణిస్తారనీ అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్,జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు, అధ్యాపకులు మాదాసు చంద్రమౌళి,చెరుకు భూమక్క,బుట్ట కవిత,నీరటి విష్ణు ప్రసాద్,జ్యాతోతు శ్రీనివాస్,వెల్దండి సౌమ్య,అగోలం గౌతమీ,బోధనేతర సిబ్బంది కనిమేని దేవేందర్,షాహినా సుల్తానా,నిఖిల్ 100 మంది ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈనెల 17న పెద్దపల్లి నియోజకవర్గంలో మంత్రుల పర్యటన

**-ఆర్,అండ్,బి రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**-ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్,విజయ రమణారావు.**

పెద్దపల్లి ప్రతినిధి,ఆగస్టు 11,
నవ సంఘర్షణ

ఈనెల 17న రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కొత్త రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు పేర్కొన్నారు. సుల్తానాబాద్ పట్టణం మరియు మండలంలోని గర్రెపల్లి గ్రామంలో మంగళవారం రోజున స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వవిప్.





ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ విజయరమణ రావు మాట్లాడుతూ...

సుల్తానాబాద్,ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లోని అనేక గ్రామాలను కలుపుతూ రూ.99 కోట్లతో గర్రెపల్లి నుండి పెగడపల్లి వరకు నిర్మించే తారు రోడ్డుకు మంత్రులచే గర్రెపల్లి గ్రామంలో శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. అనంతరం సుల్తానాబాద్ నుండి పెద్దపూర్ వరకు రూ.42 కోట్ల చే నిర్మించే రోడ్డుకు సుల్తానాబాద్ పట్టణంలో శంకుస్థాపన కార్యక్రమం,అనంతరం ఇక్కడే బహిరంగ సభ ఉంటుందన్నారు.కాల్వ శ్రీరాంపూర్,జూలపల్లి మండలాల్లో రోడ్ల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, గంగారం నుండి పందిళ్ళ,కూనవరం చౌరస్తా నుండి ముత్తారం వరకు రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్లు, సర్పంచులు, ఉపసర్పంచ్ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు, పాల్గొన్నారు.

## యువతలో దేశభక్తి, జాతీయతా భావాలను పెంపొందిస్తూ దేశంకోసం ఘనంగా “రన్ ఫర్ వందేమాతరం’

**’ -వడ్డేపల్లి రాజేశ్వరరావు.**

కూకట్పల్లి నవ సంఘర్షణ

భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో, జాతీయ గీతం “వందేమాతరం” 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విశ్వహిందూ పరిషత్-బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన “రన్ ఫర్ వందేమాతరం - విద్యార్థి దళ్” కార్యక్రమం కూకట్పల్లిలో దేశభక్తి ఉత్సాహంతో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై యువత, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, దేశభక్తులు జాతీయ జెండాలను చేతబూని “వందేమాతరం”, “భారత్ మాతాకీ జై” నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, యువతలో దేశభక్తి, జాతీయతా భావాలను



పెంపొందించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత మత్తుపదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ, విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాల వైపు అడుగులు వేయాలని సూచించారు. “విద్యార్థి శక్తి -- దేశ శక్తి” అని పేర్కొంటూ, నేటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని అన్నారు. ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన, దేశభక్తి భావాలు కలిగిన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.వందేమాతరం వంటి దేశభక్తి గీతాలు భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో స్ఫూర్తిని, ఐక్యతను నింపాయని, అలాంటి జాతీయ భావాలను నేటి తరానికి చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షులు మోహన్ రావు , ప్రాంత సహాయ కార్యదర్శి రమేష్,బజరంగ్ దళ్ నిర్వాహకులు, బిజెపి నాయకులు జీవన్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ చారి, శివాచారి, మహేందర్,విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని “రన్ ఫర్ వందేమాతరం” కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా తూము శైలేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్పల్లి నవ సంఘర్షణ

మూసాపేట్ డివిజన్ సీనియర్ నాయకులు,మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా బీజేపీ కార్యదర్శి తూము శైలేష్ జన్మదిన వేడుకలు ఆయన నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.
ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై తూము శైలేష్ ని శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తూము శైలేష్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి మూసాపేట్ డివిజన్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ కోసం శ్రమిస్తున్నారని, శైలేష్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ మరింత ఉత్సాహంతో ప్రజాసేవ, పార్టీ సేవలో కొనసాగాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆకాంక్షించారు.



## సంపాదకీయం

# ఎవరి కోసం వీరి ఆందోళనలు ?



పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ప్లకార్డులు ప్రదర్శించడం..వాయిదా పడడం షరామామూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజలకు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో ఢిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఎ ఎంపిలు కూడా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా కూటమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా కూటమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీసులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాకేంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

# విదేశీ విరాళాల నియంత్రణ

విదేశీ నిధుల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) సవరణకు కేంద్రం తలపెట్టిన సవరణలపై చర్చ రోజురోజుకూ వేడెక్కుతున్నది. దేశంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల సంస్థలు, పరిశోధనా సంస్థలకు విదేశాల నుంచి సమకూరే విరాళాలపై కీలక నియంత్రణలు ప్రవేశపెట్టే బిల్లు ప్రస్తుతం పార్లమెంటు ముందున్నది. పాలక పక్షం ఎలాగైనా దీనిని ఆమోదింపజేయాలని చూస్తుంటే, విపక్షం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. పారదర్శకత కోసమే బిల్లు తెచ్చామనేది సర్కార్ వాదన. కాదు, ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే సవరణలు తెస్తున్నారని విపక్షం ఆరోపిస్తున్నది. తాజాగా అమెరికా విమర్శలను భారత్ ఖండించడంతో ఈ వివాదానికి అంతర్జాతీయ కోణం ఏర్పడిందికేంద్ర హోంశాఖ గణాంకాల ప్రకారం 2019-2022 మధ్యకాలంలో 13,520 సంస్థలు రూ.55,741 మేర విదేశీ నిధులు స్వీకరించాయి. ఎఫ్‌సీఆర్ఏ పోర్టల్ ప్రకారం దేశంలో 14,449 సంస్థలు క్రియాశీలంగా ఉన్నాయి. 22,498 సంస్థల సర్టిఫికెట్లు రద్దయ్యాయి. మరో 15,212 సంస్థల సర్టిఫికెట్ల గడువు తీరిపోయింది. ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణల ప్రకారం ఎప్పటికప్పుడు పునరుద్ధరణ తప్పనిసరి. అదేవిధంగా ఎఫ్‌సీఆర్ఏ నమోదు రద్దయిన, వెనుకకు ఇచ్చేసిన, గడువు తీరిపోయిన సంస్థల విదేశీ నిధుల పర్యవేక్షణ, నిర్వహణ, జప్తు వంటి విశేషాధికారాలతో కూడిన 'డిజిగ్నేటెడ్ అథారిటీ' ఏర్పాటు అనేది ఈ బిల్లులోని మరో కీలక వివాదాంశం. బిల్లుకు సంబంధించినంతవరకు ప్రధానంగా మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది, పారదర్శకత పేరుతో మితిమీరిన నియంత్రణ ప్రవేశపెట్టడం. ఎఫ్‌సీఆర్ఏ కింద విదేశీ నిధులు స్వీకరించాలంటే అత్యంత కఠినమైన అనుమతులు పొందాల్సి రావడం. ఈ అనుమతులను ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకోవడం తప్పనిసరి చేయడం. జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే విరాళాలను నిషేధించాలనే సవరణ ఈ వివాదానికి కేంద్రంగా ఉన్నది. నిజంగా ఇదంతా అక్రమ నిధులను అరికట్టడానికేనా? లేక ప్రభుత్వానికి ఇష్టం లేని సంస్థలను లక్ష్యంగా చేసుకునే సాధనమా?




అనేది ప్రశ్న. ఈ నిబంధనలు పాటించడంలో విఫలమయ్యే స్వచ్ఛంద సంస్థల రిజిస్ట్రేషన్లు రద్దయిపోతాయి. బ్యాంకు ఖాతాలు స్తంభించిపోతాయి. నిధులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే వీలు కలుగుతుంది. ఎఫ్‌సీఆర్ఏ సవరణలు ప్రభుత్వం చేతిలో అస్త్రంగా మారే ప్రమాదముందనేదే ప్రధానమైన విమర్శ. రెండోది, పౌర సమాజంపై పడే ప్రతికూల ప్రభావం. గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, మానవ హక్కుల పరిరక్షణ వంటి రంగాల్లో పనిచేసే ఎన్నో సంస్థలు ప్రధానంగా విదేశీ నిధులపై ఆధారపడుతుంటాయి. ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలను కఠినతరం చేస్తే ఈ సంస్థల కార్యకలాపాలు దెబ్బతింటాయి. ఇది చివరికి సామాన్య ప్రజలపైనే ప్రభావం చూపుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం తప్పుల్ని ఎత్తిచూపి, ప్రత్యామ్నాయ ఆలోచనలను ముందుకు తెచ్చే సంస్థలపై నియంత్రణ పెంచడం ప్రజాస్వామ్య స్ఫూ ర్తికి విరుద్ధమని సవరణలను వ్యతిరేకించేవారు అంటున్నారు. మూడోది, ఈ సరికే చట్టం అమలులో వివక్ష చోటుచేసుకున్నదనే విమర్శలు. అన్ని సంస్థలపై కేంద్రం ఒకేరీతిగా చర్యలు తీసుకోవడం లేదని, ఎఫ్‌సీఆర్ఏ చట్టాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ముందుకు తెచ్చిన సవరణలపై అమెరికా నుంచి విమర్శలు రావడం గమనా ర్హం. భారతదేశంలో పౌర సమాజంపై నియంత్రణలు పెరుగుతున్నాయని కొందరు అమెరికా ప్ర జాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేయడంతో వివాదం తలెత్తింది. దీనిపై భారత ప్రభుత్వం 'తమ అంతర్గత విషయాల్లో విదేశాల జోక్యం సమంజసం కాదు' అంటూ ఈ విమర్శలను తిరస్కరించింది. విదేశీ నిధుల ప్రవాహం ద్వారా దేశ భద్రతకు, రాజకీయ స్థిరత్వానికి ముప్పు వా టిల్లే ప్రమాదం ఉంటుందనేది ప్రభుత్వ వాదన. దేశ భద్రత, ఆర్థిక పారదర్శకతను కాపాడడం మంచిదే. అలాగే కఠినమైన నియంత్రణల పేరిట ప్రజాస్వామ్య హక్కులను హరించకుండా ఉండడమూ అంతే ముఖ్యం. విదేశీ విమర్శలను తోసిపుచ్చడం ఎలా ఉన్నా, దేశీయంగా లేవనెత్తుతున్న ఆందోళనలను మాత్రం ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. చట్టం దుర్వినియోగానికి అవకాశం లేకుండా బిగింపులు ఉండాలి. అన్ని సంస్థలను ఒకేతీరుగా చూసే సమతుల్యతకు పెద్దపీట వేస్తేనే నమ్మకం పెరుగుతుంది. లేకపోతే, ని యంత్రణ పేరుతో ప్రశ్నించే గొంతుల అణచివేత అనే ముద్ర మరింత బలపడుతుంది.

# సోషల్ మీడియాకు హద్దులేవీ?

యువతకు దశాబ్దాలగీ డిజిటల్ పరిచయం కల్పించే దిశగా సోషల్ మీడియా వేదికలను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. బిగ్ టెక్ దిగ్గజాలు రూపొందించిన అల్గారిథమ్స్ మన పిల్లల స్వభావం, వ్యక్తిత్వం, నైతిక హద్దులను మనకు తెలియకుండానే ప్రభావితం చేస్తున్నాయి. అసభ్యత, అతిగా శృంగారీకరించిన కంటెంట్, ఆగ్రహాన్ని ప్రోత్సహించే కంటెంట్‌కు ప్రాధాన్యం ఇస్తూ.. ఆరోగ్యకరమైన బాల్యానికి అవసరమైన విలువలను అవి దెబ్బతీస్తున్నాయి. తల్లిదండ్రులు ఇంట్లో నైతిక విలువలు, సాంస్కృతిక సంస్కారాలు నేర్పుతున్నా.. పిల్లలు స్క్రీన్ చేతిలోకి తీసుకున్న వెంటనే లాభాలే లక్ష్యంగా పనిచేసే అల్గారిథమ్స్ ఆ విలువలను తిరగరాస్తున్నాయి. నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ఒక వ్యసనంగా మారింది. నేడు తరచూ చెప్పే మాట: డేటా కొత్త చమురు అయితే, సోషల్ మీడియా కొత్త నల్లమందు. సోషల్ మీడియా ఉచిత సేవల కనిపించినా, దాని వెనుక ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత లాభదాయకమైన వ్యాపార సంస్థలు ఉన్నాయి. మెటా, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సంస్థలు ప్రకటనలు, సబ్‌స్క్రిప్షన్లు, డేటా ఆధారిత మార్కెటింగ్, డిజిటల్ కామర్స్ ద్వారా బిలియన్ల డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి.

**పిల్లల కోసం ప్రపంచం కోరిన నిబంధనల వైపు**

పిల్లల సోషల్ మీడియా వినియోగంపై అనేక దేశాలు ఇప్పటికే కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. ఆస్ట్రేలియాలో కొన్ని సోషల్ మీడియా ఖాతాలకు కనీస వయస్సు 16 ఏళ్లు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంది. ఫ్రాన్స్ 15 ఏళ్ల కనీస వయస్సు, వయస్సు నిర్ధారణ, బాలల రక్షణకు సంబంధించిన నిబంధనలను బలోపేతం చేసింది. యూరోపియన్ యూనియన్ డిజిటల్ సర్వీసెస్ యాక్ట్ ద్వారా పెద్ద ఆన్‌లైన్ వేదికలు మైనర్లకు హానికరమైన కంటెంట్ నుంచి రక్షించేలా నిబంధనలు విధించింది. నార్వే, స్పెయిన్, గ్రీస్, డెన్మార్క్ కూడా మరింత కఠినమైన వయస్సు పరిమితులు, డిజిటల్ రక్షణ చర్యల దిశగా అడుగులు వేస్తున్నాయి. పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నేను అధ్యక్షత వహించినపుడు సోషల్ మీడియా నియంత్రణ అంశాన్ని పరిశీలించాం. యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా నిర్ణయాలకు ముందే ఈ విషయంలో చర్యలు అవసరమని మా కమిటీ సూచించింది. ప్రపంచం గత తప్పిదాల నుంచి నేర్చుకుంటూ చట్టాలను సరిదిద్దుకుంటోంది. మనం కూడా ఇతర దేశాల అనుభవాల నుంచి నేర్చుకోవాలి.

**భారత్ ముందున్న మార్గం**

భారత ప్రభుత్వం చట్టాలను సవరించి, నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన సమయం వచ్చింది. అదే సమయంలో యువతకు దశాబ్దాలగీ డిజిటల్ పరిచయం కల్పించేలా దేశీయ సోషల్ మీడియా వేదికలను అభివృద్ధి చేయాలి. భారతదేశంలో ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఉంటే వినియోగదారుల డేటాను దేశంలోనే నిల్వ చేసి ప్రాసెస్ చేయవచ్చు. దీంతో డేటా రక్షణ, చట్టాల అమలు, పర్యవేక్షణ సులభమవుతాయి. దేశీయ వేదికలు ఉద్యోగాలను



సృష్టించడంతో పాటు భారత స్టార్టప్‌లకు, ఏఐ, క్లౌడ్ టెక్నాలజీ సామర్థ్యాలకు ఊతమిస్తాయి. యూపిఐ వంటి భారతీయ పేమెంట్ వ్యవస్థలను అనుసంధానించడం ద్వారా విదేశీ మార్కెట్ ద్రవ్యాన్ని కూడా ఆదా చేయవచ్చు. ఇలాంటి వేదికలను నిర్మించడానికి భారీ పెట్టుబడులు, ఇంజినీర్లు, ఐఐ డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, కంటెంట్ మోడరేషన్ అవసరం. అయినప్పటికీ దీర్ఘకాలంలో దేశీయ సోషల్ మీడియా వల్ల కలిగే ఆర్థిక, సాంకేతిక ప్రయోజనాలు గణనీయంగా ఉంటాయి. భారత్‌కు ప్రపంచస్థాయి సోషల్ మీడియా వేదికలను నిర్మించగల సాంకేతిక ప్రతిభ, డిజిటల్ వాల్యుయేషన్లు, భారీ మార్కెట్ ఉన్నాయి. అయితే విజయం సాంకేతికతతో మాత్రమే రాదు. వినియోగదారుల విశ్వాసం, ఆవిష్కరణలు, విస్తృత వినియోగం కూడా అవసరం. దేశీయ సోషల్ మీడియా వ్యవస్థ డేటా సార్వభౌమత్వంతో పాటు ఆర్థిక వృద్ధికి, డిజిటల్ ఆవిష్కరణలకు దోహదపడగలదు.

**పిల్లలు చెల్లిస్తున్న మూల్యం**

సోషల్ మీడియా అనేది కమ్యూనికేషన్, సమాచారం, పరస్పర సంబంధాల తీరును మార్చేసింది. ఎప్పుడూ ఆన్‌లైన్‌లో ఉండాలి, వెంటనే స్పందించాలి అనే ఒత్తిడి, ఇతరులతో పోలిక, లైక్స్-కామెంట్లపై ఆందోళన వారిపై ప్రభావం చూపుతున్నాయి. అధిక సోషల్ మీడియా వినియోగం కొంతమంది కిశోరుల్లో డిప్రెషన్ లక్షణాలతో సంబంధం కలిగి ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. బాడీ షేమింగ్ కూడా ఈ ఒత్తిడికి కొత్తగా చేరింది. సైబర్ బుల్లీయింగ్, హానికరమైన కంటెంట్‌ను అల్గారిథమ్స్ మరింత మందికి చేరవేయడం వంటి అంశాలు పిల్లలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. బ్రిటన్‌లో 14 ఏళ్ల Molly Russell కేసు దీనిపై పెద్ద చర్చకు దారితీసింది. 2022లో కరోనర్.. ఆన్‌లైన్‌లో అత్యుత్సాహ, స్వీయ హాని సంబంధిత కంటెంట్‌కు గురికావడం ఆమె మరణానికి కారణమైన అంశాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఈ కేసు సోషల్ మీడియా సంస్థల బాధ్యత, పిల్లల ఆన్‌లైన్ భద్రతపై చర్చను తీవ్రతరం చేసింది. ఢిల్లీ ఎన్‌సిఆర్‌లోని ఓ అంతర్జాతీయ పాఠశాలలో ఉన్నత తరగతుల విద్యార్థులు కర్సివ్ రాత రాయడంలో, పెన్సిల్ను సరిగా పట్టుకోవడంలో కూడా ఇబ్బంది పడుతున్నారన్న విషయం ఆందోళన కలిగిస్తోంది. ట్యాబ్‌లపై ఆధారపడిన విద్యా విధానం వల్ల పెన్సిల్, పుస్తకంతో రాయడం, వాక్య నిర్మాణం వంటి ప్రాథమిక నైపుణ్యాల్లో వారు వెనుకబడుతున్నారు. డిజిటల్ పరికరాలపై అధిక ఆధారపడటం కంటి కనెక్షన్, చదవడం, అర్థం చేసుకునే సామర్థ్యాలపై కూడా ప్రభావం చూపుతోంది. Parens patriae అనే న్యాయ సూత్రం ప్రకారం పిల్లల సంక్షేమాన్ని కాపాడేందుకు కోర్టులు జోక్యం చేసుకోవచ్చు. పిల్లల విషయంలో వారి సంక్షేమమే అత్యున్నత ప్రాధాన్యత అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మైనర్లకు ప్రత్యేక రక్షణ అవసరమన్న విషయాన్ని భారత చట్టాలు ఇప్పటికే గుర్తించాయి. పోక్సో వంటి చట్టాలు పిల్లలను వేధింపులు, దోపిడీ నుంచి రక్షించడానికి ఉద్దేశించినవి. అలాంటి పరిస్థితుల్లో వయస్సు నిర్ధారణ లేకుండా, ఎలాంటి నియంత్రణ లేకుండా వ్యసనపూరిత సోషల్ మీడియాకు పిల్లలను వదిలేయడం ఆ రక్షణ లక్ష్యానికి విరుద్ధం. భారత్‌లో 18 ఏళ్లలోపు వారు బాలల హక్కుల చట్టాల కింద ప్రత్యేక రక్షణ పొందుతారు. అందువల్ల కనీసం 16 ఏళ్ల వయస్సు వరకు సోషల్ మీడియా వినియోగంపై కఠిన వయస్సు పరిమితులు, బలమైన వయస్సు నిర్ధారణ వ్యవస్థ ఉండాలి. నిబంధనలు పాటించని ప్లాట్‌ఫామ్‌లపై కఠిన జరిమానాలు విధించాలి. మైనర్లకు హానికరమైన కంటెంట్‌ను అల్గారిథమ్స్ ద్వారా ముందుకు నెట్టే టెక్నాలజీ కంపెనీలు బాలల రక్షణ చట్టాల కింద బాధ్యులను చేయాలి.

**భవిష్యత్తు మన నిర్ణయాలపై ఆధారపడి ఉంది**

సోషల్ మీడియా మన తర్వాతి తరాన్ని శక్తివంతం చేసే సాధనంగా మారుతుందా? లేక ఆరోగ్యకరమైన బాల్యం, కౌమార దశకు అవసరమైన పునాదులను బలహీనపరుస్తుందా? దీనికి సమాధానం కుటుంబాలు, పాఠశాలలు, ప్రభుత్వాలు, టెక్నాలజీ సంస్థలు ఈరోజు తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

బలమైన వ్యక్తిత్వం, స్వతంత్ర ఆలోచనా సామర్థ్యం కలిగిన బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దడమే సమాజం, దేశం భవిష్యత్తుకు కీలకం. తల్లిదండ్రులు సోషల్ మీడియా ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలి. పిల్లల్లో సమతుల్యమైన స్క్రీన్ వినియోగ అలవాట్లను పెంచాలి. టెక్నాలజీ కంపెనీలు చిన్న వయసు వినియోగదారులకు మెరుగైన గోప్యతా రక్షణలు, బలమైన కంటెంట్ మోడరేషన్‌ను అందించాలి.

# స్వయంభు పోచమ్మ బండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- 5లక్షల సొంత ఖర్చులతో ఏలేటి సంతోష్ రెడ్డి అభివృద్ధి పనులు.
- ఆలయంలో సర్పంచ్ రమేష్ తో కలిసి సంతోష్ రెడ్డి ప్రత్యేక పూజలు
- బయటపడిన కాలభైరవ విగ్రహం,పురాతన నాగ దేవత విగ్రహాలు



**చిగురుమామిడి)ఆగస్టు11 నవ సంఘర్షణ**

:మొక్కిన మొక్కులు వెంటనే తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధిగాంచి స్వయంభుగా వెలసిన ముదిమాణిక్యం గ్రామ శివారులోని పోచమ్మ బండను గ్రామస్తుల సహకారంతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆ గ్రామ సర్పంచ్ బోయిని రమేష్,గ్రామ యువకుడు ఏలేటి సంతోష్ రెడ్డి తెలిపారు.మంగళవారం సర్పంచ్ బోయిని రమేష్, ఏలేటి సంతోష్ రెడ్డి గ్రామస్తులతో కలిసి పోచమ్మ తల్లి ఆలయంలో,కాలభైరవుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.తవ్వకాల్లో బయటపడిన కాలభైరవుడి విగ్రహం వద్ద గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ 30ఎకరాల్లో విస్తరించి ఉన్న పోచమ్మ బండపై చాలా సంవత్సరాల క్రితం పురాతన ఆలయం ఉన్నట్లు తెలుస్తుందన్నారు.గ్రామ యువకుడు ఏలేటి సంతోష్ రెడ్డికి నిద్రలో పోచమ్మ బండ వద్ద విగ్రహాలు ఉన్నాయని,వాటిని వెలికి తీసి ప్రతిష్టించాలని కలలో వచ్చి చెప్పినట్లు తెలిపారు.దీంతో వెంటనే ఏలేటి సంతోష్ రెడ్డి దాదాపు 5లక్షల రూపాయల తన స్వంత ఖర్చులతో ఆలయం వద్ద వివిధ రకాల అభివృద్ధి పనులతోపాటు త్రాగునీటి కోసం బోరు వేయటం,విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. పోచమ్మ బండ గుట్టపై దాదాపు 30ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని,10ఎకరాల్లో విస్తరించి ఉన్న గుడి బండపై కాకతీయులనాటి కళాతోరణం తోపాటు వివిధ రకాల విగ్రహాలు ఉన్నట్లు చెప్పారు. ఇట్టి విషయంపై పురవస్తు శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు సర్పంచ్ రమేష్ తెలిపారు.అందరి సహకారంతో పోచమ్మ బండను పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, ఇది ఎంతో చరిత్ర కలిగిన ప్రదేశమని సర్పంచ్ రమేష్, ఏలేటి సంతోష్ రెడ్డి లు తెలిపారు.సొంత ఖర్చులతో పోచమ్మ బండను అభివృద్ధి పథంలోకి తీసుకు వస్తున్న ఏలేటి సంతోష్ రెడ్డిని గ్రామస్తులు,మండల ప్రజలు అభినందిస్తున్నారు.ఆ పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలందరినీ చల్లగా చూసేలా గ్రామదేవతలు కరుణ చూపాలని సంతోష్ రెడ్డి తెలిపారు.తను సర్పంచ్ గా ఉన్న సమయంలో అక్కడ ఇలాంటి విగ్రహాలు బయటికి రావడం చాలా సంతోషంగా ఉందని సర్పంచ్ తెలిపారు.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-బీజేపీ రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య
-రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి



**చిగురుమామిడి)ఆగస్టు11 నవ సంఘర్షణ**

కొండమల్లేపల్లి మండల బీజేపీ పదాధికారుల సమావేశం పెండ్లి పాకాల గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు భూతరాజు భరత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, మండల ఇన్‌చార్జి పోతేపాక సాంబయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోతేపాక సాంబయ్య మాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిలో విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని ప్రజల్లో మరింతగా పెంపొందించాలని అన్నారు. అనంతరం కొండమల్లేపల్లి మండలంలోని ప్రధాన ప్రజా సమస్యలు, రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా ఉద్యమం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని పోతేపాక సాంబయ్య విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, పేదలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి అని డిమాండ్ చేశారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం పోరాడాలని సాంబయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నప్రోలు పద్మావతి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు యాదయ్య యూమోర్చ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ నెల్లికంటి గోపి ఉపాధ్యక్షులు లింగస్వామి వశ్య నాయక్ కార్యదర్శి విజయ్ తారయ్య వెంకటేష్ , లక్ష్మణ్ బాబూజీ ఆనంద్ గణేష్ చందు ఉదయ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ కు పలు డిమాండ్లతో టీఎంఆర్‌పీఎస్ వినతిపత్రం

**మహబూబ్‌నగర్ ఆగస్టు11 నవ సంఘర్షణ**

ప్రజా సంక్షేమ డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎంఆర్‌పీఎస్) నాయకులు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సిరసినోళ్ల బాలరాజ్ మాదిగ మాట్లాడుతూ.. అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు సామాజిక భద్రతా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్‌టీఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందుతున్న ప్రైవేట్ సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.



మాదిగ దండోరా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు రిజర్వేషన్, పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, ఎస్సీల అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చడం, చెప్పులు కుట్టే మరియు డప్పు కళాకారులకు నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండి బాలరాజు మాదిగ, ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య మాదిగ, రాష్ట్ర కార్యదర్శులు జోగు రామస్వామి, మాచారం మాసన్న, గౌరవ అధ్యక్షులు కోడుపర్తి రాములు, జిల్లా అధ్యక్షులు ఎలుక బాలరాజు మాదిగతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి

- ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి
- ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన
-ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం





**నకిరేకల్ ఆగస్టు 11**
**ఆగస్టు11 నవ సంఘర్షణ**

నకిరేకల్ మండల కేంద్రంలోని పీూణూ కార్యాలయంలోగ్రామ పంచాయతీల అభివృద్ధి మరియు సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ సందర్భంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సాధించాలని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు తదితర ప్రజా అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు మెరుగైన పాలన, సేవలు అందించేలా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యేవేముల వీరేశం సూచించారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, సర్పంచులు, పీూజ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాటిగడ్డ తండాలో గ్రామసభ - గ్రామ అభివృద్ధిపై చర్చ



**గోపాల్ పేట్ ఆగస్టు11 నవ సంఘర్షణ**

గోపాలపేట మండలం పాటిగడ్డ తండాలో గ్రామసభ నిర్వహించారు.పాటిగడ్డ తాండ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఉష అధ్యక్షతన గ్రామపంచాయతీ ప్రణాళిక జీపీడీపీ 2026 - 2027 తయారీలో భాగంగా మొదటి గ్రామసభ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో గ్రామపంచాయతీ యొక్క అంచనా బడ్జెట్ యొక్క తయారీ గురించి గ్రామ కార్యదర్శి మౌనిక వివరించడం జరిగింది..గ్రామసభలో గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, రోడ్లు, తాగునీరు, వీధి లైట్లు, డ్రైనేజీ, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలోని సమస్యలను ప్రజలు ప్రత్యక్షంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హునికి చేరేలా చూడాలని, గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని తెలిపారు.అధికారులు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను స్వీకరించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉషా హర్యా నాయక్, ఉప సర్పంచ్ రజని రాందాస్,వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి మౌనిక,మాజీ ఎంపీటీసీ పుల్యా నాయక్,రాజేందర్, హన్య నాయక్, ఆశా వర్కర్, అంగన్వాడీ టీచర్ మరియు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో నిలిచిపోయిన అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ ఆందోళన



**ఆగస్టు11 నవ సంఘర్షణ**
**గోదావరిఖని న్యూస్**

టీ ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాత మునిసిపల్ ఆఫీస్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్,ఎన్టీఆర్ నగర్లో కూరగాయల మార్కెట్,విఠల్ నగర్ లో మార్కెట్,లను మాజీ ఎశ్రీఖ కోరుకంటి చందర్ నిర్మిచి తలపేటిన అ కాంప్లెక్సులు సగంలో నిలిచిపోయాయి వాటి మీద ఎశ్రీఖ,కలెక్టర్ కనీస శ్రద్ధ పెటలని,లక్షలు విలువ చేసే స్థలాలను అన్యాక్రాంతం కాకుండా వాటిని వాడుకలోకి తేవాలని.ఎన్టీఆర్ నగర్లో నిర్మించ తలపెట్టిన అ మార్కెట్ స్థలని పరిశీలించి నిరుపేదలకు మీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదలకు ఉచితంగా ఇవాలని ,అనువైన స్థలం లో జి ౦ఇండ్లు నిర్మించాలని సంబంధిత అధికారులను కోరారు బి ఆర్ ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు నీరటీ శ్రీనివాస్ ,

# మన్మోహన్ సింగ్‌ను చరిత్ర ఎన్నటికీ మరువదు



**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**

బొగ్గు కుంభకోణం కేసులో దివంగత నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు సుప్రీంకోర్టు ఇటీవల క్లీన్ చిట్ ఇచ్చింది. దీనిపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. మన్మోహన్ సింగ్‌ను అత్యంత ప్రభావశీలమైన ప్రధానిగా, మృదుస్వభావిగా చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంతో పోలిస్తే ఆయన తన నైతికత, జవాబుదారితనంతో పూర్తి భిన్నమైన వ్యక్తిగా కనిపిస్తారని పేర్కొన్నారు. ఈ తీర్పుతో భారత రాజకీయాల్లో ఒక విషాదకర ఘట్టానికి ముగింపు పడిందని సోనియాగాంధీ అన్నారు. నీతి నిజాయతీ కలిగిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నానికి ఫుల్ స్టాప్ పడిందని వ్యాఖ్యానించారు. 'దివంగత నేత మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఒక లాబీ పూర్తిసన్నద్ధతతో, సమన్వయంతో పనిచేసింది. అధికార గణం మొదలు న్యాయవ్యవస్థకు చెందిన వారు, పౌర సమాజం, ఆర్ఎస్ఎస్, బీజేపీ అందరూ ఉన్నారు. నాటి ఆరోపణలన్నీ బోగస్ అని నేడు రుజువైంది. మన్మోహన్ సింగ్ నిర్దోషి అన్న విషయం స్పష్టంగా తేలింది' అని ఓ జాతీయ వార్త పత్రికలో సోనియా గాంధీ రాశారు. ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు ఈడీ, సీబీఐ వంటి సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగపరిచిందని కూడా ఎంపీ సోనియాగాంధీ ఆరోపించారు. 'వాటి లక్ష్యం ప్రత్యర్థులపై ఒత్తిడి తేవడమే. కొందరి గొంతు నొక్కారు. మరికొందరిని బీజేపీలో కలిపేసుకున్నారు. మరికొన్ని అసాధారణ సందర్భాల్లో కొందరికి మంత్రి పదువులు కూడా దక్కాయి' అని సోనియాగాంధీ విమర్శించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు దేశ పార్లమెంట్ చరిత్రలో అత్యంత దిగజారిన వ్యాఖ్యలుగా నిలిచిపోతాయని అన్నారు.

# లాంచ్ అయిన 85 సెకండ్లలోనే పేలిపోయిన చైనా రాకెట్.



**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**

చైనా ప్రయోగించిన ఒక రాకెట్ ప్రయోగం విఫలమైంది. రాకెట్ ప్రయోగించిన 85 సేకండ్లలోనే గాలిలో పేలిపోయింది. ఈ ఘటన సోమవారం రాత్రి దక్షిణ చైనాలో జరిగింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. లాంగ్ మార్చ్ 7 అనే ఈ రాకెట్‌ను వెంచాంగ్‌లోని స్పేస్ లాంచ్ సైట్ నుంచి రాత్రి 8.02 గంటలకు ప్రయోగించారు. ఇది చైనాశాట్-4బీ అనే శాటిలైట్‌ను మోసుకెళ్లింది. అయితే, ప్రయోగించిన 85వ సెకండ్‌కు ఈ రాకెట్ పేలిపోయింది. అక్కడికి దగ్గర్లోని సముద్ర తీర ప్రాంతంలో కూలిపోయినట్లు తెలుస్తోంది. దీనిపై చైనా అధికారికంగా ప్రకటించలేదు. కానీ, ఇందుకు సంబంధించిన వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ రాకెట్ పేలడానికి, ప్రయోగం విఫలం కావడానికి గల కారణాలు కూడా ఇంకా తెలియరాలేదు. దీనిపై అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ రాకెట్ ప్రయోగం గురించి ముందుగా స్థానిక మీడియా వెల్లడించింది. కానీ, ప్రయోగం విఫలమైన తర్వాత నుంచి దీనికి సంబంధించి ఎలాంటి సమాచారం వెల్లడి చాలేదు. లాంగ్ మార్చ్ 7ఏ రాకెట్లను చైనా 2020 నుంచి ప్రయోగిస్తోంది. అప్పట్లో జరిపిన తొలి ప్రయోగం కూడా విఫలమైంది. తర్వాత మళ్లీ ఇదే రాకెట్‌ను తిరిగి 2021లో ప్రయోగించగా సక్సెస్ అయింది. అప్పటినుంచి అనేకసార్లు లాంగ్ మార్చ్ 7ఏ రాకెట్లను చైనా ప్రయోగిస్తోంది. శాటిలైట్లను జియోసింక్రనస్ ఆర్బిట్‌లో ప్రయోగించేందుకు చైనా వీటిని వినియోగిస్తోంది. గతంలో చైనా ప్రయోగించిన లాంగ్ మార్చ్ 3బీ రాకెట్ స్థానంలో వీటిని ప్రయోగిస్తోంది.

# సిరియా మాజీ అధ్యక్షుడు బాషర్ అల్ అసద్‌కు మరణశిక్ష ఖరారు

**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**



సిరియా మాజీ అధ్యక్షుడు బాషర్ అల్ అసద్ కు .. స్థానిక కోర్టు మరణశిక్షను ఖరారు చేసింది. యుద్ధ నేరాలకు పాల్పడిన కేసులో ఆ శిక్షను విధించారు. సుమారు 14 ఏళ్ల పాటు సిరియాలో అంతర్యుద్ధాన్ని కొనసాగించారని, దాన్ని మర్డర్‌గా తేల్చుతూ శిక్షను ఖరారు చేశారు. అసద్ సోదరుడు మాహెర్ అల్ అసద్‌కు కూడా యుద్ధ నేరాల కింద మరణశిక్షను ఖరారు చేశారు. అయితే ఇద్దరూ కూడా ఈ కేసులో కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కాలేదు. బాషర్ తరపున ఆయన తల్లి బంధువు ఆతెప్ నాజిబ్ హాజరయ్యారు. సిరియా న్యాయ వ్యవస్థ తొలిసారి బాషర్ అల్ అసద్‌కు మరణశిక్షను ఖరారు చేసింది. 2024 డిసెంబర్‌లో అసద్‌తో పాటు ఆయన ఫ్యామిలీ రష్యాకు పరారీ అయిన విషయం తెలిసిందే. హయ్యత్ తాహిర్ అల్ షామ్ నేతృత్వంలోని విపక్ష దళాలు డమస్కస్‌కు దూసుకురావడంతో బాషర్ దేశం విడిచి పారిపోయారు. దీంతో సిరియాలో సుమారు 50 ఏళ్ల అసద్ ఫ్యామిలీ పాలన అంతమైంది. మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడడం, సామూహిక హత్యలకు పాల్పడిందెవరో అన్న కోణంలో విచారణ చేపట్టారు. సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు రష్యా ఆశ్రయం కల్పించిన విషయం తెలిసిందే. సిరియాలో జరిగిన మారణహోమంలో సుమారు 5 లక్షల మంది మరణించారు. లక్షల సంఖ్యలో జనం నిరాశ్రయులయ్యారు.

# మీ తప్పులకు ఏఐని నిందిస్తే కుదరదు..

## బ్యాంకులకు ఆర్బీఐ గవర్నర్ హెచ్చరిక

**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**

కృత్రిమ మేథ వినియోగంలో బ్యాంకులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టంచేశారు. 'ఏఐ' వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు సంబంధించి పూర్తి జవాబుదారీతనం బ్యాంకులదేనని, పొరపాటు జరిగినప్పుడు ఏఐ మోడళ్లను నిందించడం ఆమోదయోగ్యం కాదని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం ముంబైలో ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఫైబాక్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదైనా నిర్ణయం విషయంలో అంతిమ బాధ్యత బ్యాంకుదే తప్ప, సేవలు అందించిన వెండార్‌ది, అల్గారిథమ్‌ది కాదని మల్హోత్రా



స్పష్టంచేశారు. 'ఈ నిర్ణయం తీసుకున్నది మోడల్ అని చెప్పడం సమర్థనీయం కాదు. రెగ్యులేటర్‌గా మేము కానీ, కస్టమర్లు కానీ ఇటువంటి సమాధానాలను ఎప్పటికీ అంగీకరించం' అని ఆయన తేల్చి చెప్పారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా దానికి అదనపు తోడ్పాటునిచ్చే సాధనంగా మాత్రమే ఏఐని వినియోగించుకోవాలని సూచించారు. ఏఐ అందించే సిఫార్సులను విశ్లేషించగలగడం, అవసరమైనప్పుడు జోక్యం చేసుకుని వాటిని సవరించగలగడం వంటి పటిష్టమైన మానవ పర్యవేక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా ఉండాలని మల్హోత్రా నొక్కిచెప్పారు. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన నిర్దిష్ట ఏఐ విధానాన్ని కలిగి ఉండాలని, థర్డ్-పార్టీల నుంచి సేవలు పొందినప్పటికీ ఫలితాలకు బ్యాంకులే జవాబుదారీగా ఉండాలని స్పష్టంచేశారు. కస్టమర్ సేవలను మెరుగుపరచడం, జీఎస్టీ ఫైలింగ్స్, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ వంటి డేటా ఆధారంగా రుణ సదుపాయాలను విస్తరించడం, మోసాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐకి అపారమైన సామర్థ్యం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. అదే సమయంలో మోడల్ పక్షపాతం, డేటా గోప్యత, సైబర్ భద్రతా ముప్పులపట్ల బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏఐ ద్వారా జరిగే మోసాలను అడ్డుకోవడానికి కూడా తిరిగి అదే ఏఐ సాంకేతికతను ఆయుధంగా వినియోగించుకోవాలని సూచించారు

# గ్రామాల్లోని సర్కారీ స్కూళ్లపై ఎందుకీ నిర్లక్ష్యం?

**-15 నుంచి దేశవ్యాప్తంగా సీజేపీ ప్రచారం**



**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**

గ్రామీణ భారతంలో విద్యాపరమైన మౌలిక సదుపాయాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచేందుకు దేశవ్యాప్తంగా ఒక ప్రచారాన్ని ప్రారంభించనున్నట్టు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మంగళవారం ప్రకటించారు. ఆగస్టు 15న ఈ కార్యక్రమాన్ని దీప్కే ప్రారంభించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహారాష్ట్ర హింగోలిలోని తన స్వగ్రమం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు చెప్పారు. స్వాతంత్ర్యానంతరం గడచిన 80 సంవత్సరాల్లో దేశంలో అత్యంత అధికంగా నిర్లక్ష్యానికి గురైనది గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులేనని ఆయన చెప్పారు.

# ఏటా వెయ్యి కోట్ల గుడ్లు వృథా..

**-భారత్‌పై ఎన్ఈసీసీ నివేదిక వెల్లడి**

**-ఒకరు ఏడాదికి సగటున తినేవి 101**

**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**



భారతదేశంలో గుడ్ల వినియోగం, ఉత్పత్తిపై వెలువడిన నివేదిక పలు ఆసక్తికర వివరాలను వెల్లడించింది. నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ(ఎన్ఈసీసీ) ప్రజల్లో గుడ్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నది. 25 వేల మందికిపైగా పౌల్ట్రీ రైతులు సభ్యులుగా ఉన్న ఎన్ఈసీసీ రోజువారీ గుడ్డు ధరలను నిర్ణయించడంలో కీలక ప్రాత్ర పోషిస్తున్నది. ప్రస్తుతం భారత పౌల్ట్రీ రంగం సుమారు రూ.1,14,000 కోట్ల విలువతో ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌లలో ఒకటిగా ఎదిగింది. ఏటా 13,800 కోట్ల గుడ్లను ఉత్పత్తి చేస్తూ, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద గుడ్ల ఉత్పత్తిదారుగా నిలిచింది. అయితే ఇందులో 11,000 కోట్ల గుడ్లు మాత్రమే వినియోగదారులకు అందుతున్నాయి. రవాణా లోపాల కారణంగా ఏటా 1,000 కోట్ల గుడ్లు వృథా అవుతున్నాయని 'ఇంక్-42' తన అధ్యయనంలో తెలిపింది. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలు గుడ్ల ఉత్పత్తిలో ముందున్నాయి. ఒక భారతీయుడు ఏడాదికి సగటున 101 గుడ్లను మాత్రమే తింటున్నాడు. ఇది ప్రపంచ సగటు కంటే 44 శాతం తక్కువ.

# మిస్సింగ్ కేసులపై ఉత్తర్వులు.. రాష్ట్రాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**-పిల్లలు..పెద్దలు సహా అందరికీ వర్తిస్తాయి**



**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**

మిస్సింగ్ కేసుల్లో ఎఫ్ఐఆర్ వెంటనే నమోదుచేయాలంటూ ఇంతకుముందు జారీచేసిన ఉత్తర్వులు..వయసు, లింగభేదం లేకుండా ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టతనిచ్చింది. ఉత్తర్వుల్లో 'వ్యక్తి' అనే పదం కేవలం పిల్లలను మాత్రమే సూచిస్తున్నదని, పెద్దలకు వర్తించదని కొన్ని రాష్ట్రాలు భావించటాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఇంతక్రితం తాము జారీచేసిన ఉత్తర్వులో భాష స్పష్టంగా, సందేహానికి తావు లేకుండా ఉన్నదని సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా పేర్కొన్నది. ఏదైనా రాష్ట్రం ఉత్తర్వును పాటించటంలో విఫలమైతే సంబంధిత ప్రధాన కార్యదర్శి, డీజీపీకి ధిక్కార నోటీసు జారీ చేస్తామని హెచ్చరించింది.

# జాంబీ డ్రగ్స్‌కు బానిసవుతున్న పంజాబ్..

**-ఎంపీ హర్భజన్ వీడియోపై వివాదం**

**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**



బీజేపీ రాజ్యసభ ఎంపీ, మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్.. తన సోషల్ మీడియా ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు తీవ్ర వివాదాన్ని సృష్టిస్తున్నది. పంజాబీ యువత డ్రగ్స్ బానిసై.. జాంబీలుగా మారిపోతున్నట్లు తన వీడియోలో ఎంపీ హర్భజన్ ఆరోపించారు. ఇటీవల బీజేపీలో చేరిన హర్భజన్.. పంజాబ్ సర్కారు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తలపాగా కట్టుకున్న ఇద్దరు వ్యక్తులు జాంబీల తరహాలో నిలబడి ఉన్న వీడియోను టర్బనేటర్ తన ఎక్స్‌లో షేర్ చేశారు. పంజాబ్‌ను ఎలా మార్చారో చూడండి అంటూ ఆయన కామెంట్ చేశారు. తన పంజాబ్‌పై చెడు దృష్టి పడిందని ఆరోపించారు. పంజాబ్‌ను, పంజాబీ యువతను ప్రభుత్వాలు నిర్వీర్యం చేసినట్లు హర్భజన్ ఆరోపించారు. ఈ వీడియోకు మిలియన్ల సంఖ్యలో వ్యూవ్స్ వచ్చాయి. జాంగీ డ్రగ్‌గా పిలువబడే గ్జైలజైన్ డ్రగ్ తీసుకోవడం వల్ల ఆ వ్యక్తులు అలా మారినట్లు తెలుస్తోంది. ఎంపీ హర్భజన్ పోస్టు చేసిన వీడియోపై విమర్శలు వస్తున్నాయి. ఆ వీడియోను పంజాబ్‌లో షూట్ చేయలేదని ఆప్ నేత , పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా ఆరోపించారు. బీజేపీ పంజాబ్ సర్కారును అపఖ్యాతికి గురి చేస్తున్నదని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో తీసిన వీడియోకు పంజాబ్ అని చెప్పి తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆయన తెలిపారు. గుజరాతీ పోర్టుల్లో భారీ స్థాయిలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంటున్నారని, అక్కడ నుంచి ఆ డ్రగ్స్ పంజాబ్‌కు వస్తున్నట్లు చీమా ఆరోపించారు. తాజా భజ్జీ పోస్టు చేసిన వీడియోను రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లాలో షూట్ చేసినట్లు తెలుస్తోంది.

# తగ్గిపోతున్న రుతుపవనాల బలం

## భారత్‌లో ఎల్ నినో పునరాగమనం?..

**న్యూఢిల్లీ ఆగస్టు11 నవ సంఘర్షణ**

దేశంలో ఇటీవల పుంజుకున్నట్టు కన్పించిన నైరుతి రుతుపవనాల బలం క్రమేపీ తగ్గుతున్నది. ఉపగ్రహాలు విడుదల చేసిన తాజా చిత్రాల ప్రకారం బంగాళాఖాతం సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో కమ్ముకున్న మేఘాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. కొన్ని వారాల పాటు వర్షపాతం చురుకుగా నమోదైన తర్వాత ఈ తాజా పరిణామాలు ఎల్ నినో ప్రభావం మొదలవుతుందేమోనన్న ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం మధ్యభారత దేశంపై అల్పపీడన వ్యవస్థ మేఘాలను మదించి వర్షాలను కురిపించే ప్రధాన వాతావరణ వ్యవస్థగా కొనసాగుతున్నది. దీని ప్రభావం ప్రధానంగా దేశంలోని మధ్య ప్రాంతానికే పరిమితమై ఉండగా, ఇతర ప్రాంతాల్లో రుతుపవన కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. మన రుతుపవనాలకు తేమను అందించే కీలక వనరు





అయిన బంగాళాఖాతంపై మేఘాల ఆవరణ తగ్గడం అనేది ఒక ముఖ్యమైన సంకేతాలలో ఒకటి. కాగా, రుతుపవన అక్షం కూడా దక్షిణం వైపునకు మారుతున్నది. ఈ మార్పు వల్ల అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతం ఉత్తర మైదానాల నుంచి దూరంగా జరుగుతుంది. తద్వారా, ఢిల్లీ-ఎన్‌సీఆర్, హర్యానా, పంజాబ్, యూపీలలో ప్రధానంగా పొడి వాతావరణం తిరిగి వచ్చే అవకాశం ఉంది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో పరిస్థితుల పురోగతిని శాస్త్రవేత్తలు, వాతావరణ పరిశీలకులు నిశితంగా గమనిస్తున్న తరుణంలో ఈ కొత్త ధోరణి ఆవిర్భవిస్తున్నది. ఎల్ నినో సాధారణంగా వాతావరణ ప్రసరణలో మార్పులతో ముడిపడి ఉంటుంది. అది దేశంలోని రుతుపవనాలను బలహీనం చేయవచ్చు లేదా అంతరాయం కలిగించవచ్చు. దాని ప్రభావం ఒక్కో సంఘటనకు ఒక్కో విధంగా ఉంటుంది. ఉపగ్రహాలు తాజాగా వెలువరించిన చిత్రాలు రుతుపవనాల వైఫల్యాన్ని కచ్చితంగా చూపించవు. వర్షాన్ని కురిపించే వాతావరణ వ్యవస్థలు మధ్య భారతదేశంలో చురుకుగానే ఉన్నాయి. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన పరిస్థితులు చూస్తే రుతుపవనాలు మందగమన స్థితికి చేరుకున్నాయని అనిపిస్తున్నది. ఈ బలహీన మేఘాల స్థితి తాత్కాలికమా, లేక ఎల్ నినోకు మొదటి స్పష్టమైన సంకేతమా? అన్న విషయాన్ని నిర్ధారించడానికి మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

# బిజినెస్

## ఎలక్ట్రిక్ వెహికల్‌గా తిరిగి రానున్న టాటా నానో.. ఈసారి అదరగొట్టేస్తుందా



భారతీయ వాహన రంగంలో టాటా సంస్థ రూపొందించిన నానో కారు ఒక సంచలనం. అనుకున్నంత విజయం సాధించకపోయినా.. భారతీయులపై నానో కారు చూపిన ప్రభావాన్ని మర్చిపోలేం. సామాన్యుడికి కూడా తక్కువ ధరలోనే కారు (ఫోర్ వీలర్) అందించాలనే టాటా ప్రయత్నం మెచ్చుకోదగ్గదే. 2009లో మార్కెట్లోకి విడుదలైన ఈ కారు 2018లో నిలిచిపోయింది. ఎనిమిదేళ్ల క్రితం ఆగిపోయిన ఈ కారు ఇప్పుడు తిరిగి మార్కెట్లోకి రాబోతుందనే ప్రచారం జరుగుతోంది. అయితే, ఈసారి సరికొత్తగా. అదీ ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ)గా. త్వరలో టాటా నానో ఈవీ రాబోతుందనే ప్రచారం చాలాకాలంగా జరుగుతోంది. ప్రస్తుతం ఈవీల హవా నడుస్తోంది. టూ వీలర్స్, ఫోర్ వీలర్స్, హెవీ వెహికల్స్ కూడా ఈవీ మోడల్‌లో వస్తున్నాయి. ఈవీ కార్లకు మంచి డిమాండ్ ఉంటోంది. అందులోనూ టాటా నానో తరహా ఈవీ, కాంపాక్ట్ కార్లు కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. చిన్నకార్లను కోరుకుంటున్నారు. అందువల్ల నానో ఈవీకి ఇదే మంచి టైమ్ అని మార్కెట్ వర్గాల అంచనా. దీనికి తగ్గట్లే నానో ఈవీని కంపెనీ రూపొందిస్తున్నట్లు సమాచారం. నానో ఈవీ అందుబాటులోకి వస్తే అనేక రకాలుగా ఉపయోగం ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కారు చిన్న సైజ్‌లో ఉంటుంది. దీంతో సిటీ రోడ్ల మీద సులభంగా తిరగడానికి వీలుంటుంది. అలాగే, తక్కువ స్పేస్‌లోనే ఈజీగా పార్క్ చేయొచ్చు. ఈవీ కాబట్టి, ఖర్చు తక్కువ. మెయింటెనెన్స్ ఛార్జీలు కూడా తగ్గుతాయి. దీంతో టూ వీలర్స్ నుంచి చాలా మంది ఈజీగా నానో ఈవీకి మారిపోతారు. అందులోనూ మొదటిసారి కార్ కొనాలనుకునేవారికి ఇది మంచి ఛాయిస్ అవుతుంది. రెండో చిన్న కార్ కొనేవారికి కూడా ఇది ఉపయోగంగా ఉంటుంది. అయితే, గతంలోలాగా తక్కువ ధర అనే కాన్సెప్ట్ మాత్రమే కాకుండా.. ఈసారి సేఫ్టీ, స్టైల్, ఫీచర్స్, డిజైన్ వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తే బాగుంటుంది అనేది వాహనదారుల మాట. ప్రధానంగా మంచి సేఫ్టీ ఫీచర్స్ ఉండాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే, బెటర్ పెర్ఫామెన్స్, మంచి ఇంటీరియర్, లేటెస్ట్ స్మార్ట్ టెక్నాలజీ వంటివి యాడ్ చేస్తే నానోకు తిరుగుండదు. సైజ్, కాస్ట్ తక్కువగా ఉన్న పెర్ఫామెన్స్ విషయంలో మాత్రం వెనుకడుగు వేయొద్దని ప్రజల ఆలోచన. ఇందుకు అనుగుణంగా నానో ఈవీ వస్తే మంచి సక్సెస్ సాధించడం ఖాయం. ఇక, టాటా ఇప్పటికే ఈవీ కార్లలో దూసుకెళ్తోంది. టియాగో ఈవీ, పంచ్ ఈవీ, నెక్సాన్ ఈవీతోపాటు కొన్ని ఎస్‌యూవీలను కూడా లాంఛ్ చేసింది. ఇవన్నీ మంచి విజయం సాధించాయి. మరి టాటా నానో ఈవీ కూడా ఈ లిస్టులోకి వెళుతుందేమో చూడాలి. అయితే, నానో ఈవీపై టాటా సంస్థ ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..
# సెన్సెక్స్ 388 పాయింట్లు పతనం



భారత స్టాక్ మార్కెట్ మంగళవారం నష్టాల్లో ముగిసింది. సోమవారం లాభాల్లో ముగిసినప్పటికీ.. మంగళవారం నష్టాల బాటలోనే సాగింది. మధ్యాహ్నం 3.30 గంటలకు ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 388 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 112 పాయింట్లు నష్టపోయింది. ఉదయం ట్రేడింగ్ నష్టాల్లోనే ప్రారంభమైంది. సోమవారం నాటి ముగింపుతో పోలిస్తే ఉదయం సెన్సెక్స్ 320 పాయింట్లు తక్కువగా 78,204 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ 94 పాయింట్ల నష్టంతో 24,490 వద్ద ప్రారంభమైంది. చివరకు బీఎస్ఈ సెన్సెక్స్ 388.19 పాయింట్ల (0.49 శాతం) నష్టంతో 78,154.25 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 112.10 పాయింట్లు (0.46 శాతం) నష్టంతో 24,471.70 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్ మాత్రం మిశ్రమ ఫలితాల్ని సాధించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 2.02 పాయింట్లు (0.01 శాతం) నష్టపోగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 34.63 పాయింట్లు (0.38 శాతం) లాభాలు పొందింది. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 1.17 శాతం నష్టపోయింది. నిఫ్టీ రియాల్టీ 1 శాతం నష్టపోయింది. నిఫ్టీ ఫార్మా మాత్రం 1.02 శాతం లాభపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో టైటాన్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ లాభపడ్డాయి. ఎటర్నల్ అత్యధికంగా 2.01 శాతం లాభపడింది. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్ సంస్థలు నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా అల్ట్రాటెక్ సిమెంట్ సంస్థ 2.75 శాతం నష్టపోయింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ట్రేడింగ్ నష్టాల్లో ముగిసింది. డాలర్‌తో రూపాయి మారక విలువ మరింత బలపడింది. మంగళవారం 15 పైసలు తగ్గిన రూపాయి 95.43 వద్ద కొనసాగుతోంది. ఉదయం 95.38 వద్ద ఓపెన్ కాగా, మధ్యలో 95.37కు చేరింది. చివరకు 95.43 వద్ద ముగిసింది. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.13 శాతం తగ్గి, 87.61 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# యాక్సిస్ ఎనర్జీతో ఓలా జట్టు

బెంగళూరు,

ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్.. తాజాగా యాక్సిస్ ఎనర్జీతో జట్టుకట్టింది. 2032 నాటికి 20 గిగావాట్ల బ్యాటరీ ఎనరీ స్టోరేజ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. యుటిలిటీ-స్కేల్, సీఅండ్ఐ ఎనర్జీ స్టోరేజ్ ప్లాట్‌ఫామ్‌లో తొలి ఒప్పందం ఇదేనని పేర్కొంది. 2028 తర్వాత ప్రతియేటా 5 గిగావాట్ల వరకు వార్షిక సామర్థ్యాన్ని పెంచుకోనున్నది.




## 18 నెలల్లో 17 కేజీలు తగ్గిన సర్ఫరాజ్ ఖాన్..
## ఇది కదా కమ్‌బ్యాక్ అంటే..!

**టీమిండియా టెస్ట్ జట్టులోకి సర్ఫరాజ్ రీఎంట్రీ**

**18 నెలల్లో 17 కిలోల బరువు తగ్గిన సర్ఫరాజ్**

**ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో తొలి టెస్టు ప్రారంభం**




# స్పోర్ట్స్

టీమిండియా యంగ్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ తిరిగి భారత జట్టులోకి వచ్చేశాడు. నిలకడగా పరుగులు చేస్తున్నా.. ఫిట్ నెస్ కారణాలతో జట్టుకు దూరమైన అతడు.. ఇప్పుడు అనూహ్యంగా జట్టులోకి వచ్చాడు. శ్రీలంకతో టెస్ట్ సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులోని సాయి సుదర్శన్ గాయంతో దూరం కావడం అతడికి కలిసొచ్చింది. దానికి తోడు ఫిట్‌నెస్‌పై కూడా ఫోకస్ చేసి.. మంచి శరీరాకృతి సంపాదించాడు. దీంతో జట్టులోకి తనను ఎంపిక చేయాల్సిన పరిస్థితిని అతడు సృష్టించాడు. గతంలో భారీ బరువు వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న సర్ఫరాజ్ ఖాన్.. ఇప్పుడు సూపర్ స్లిమ్ అయ్యాడు. గత 18 నెలల్లోనే అతడు సుమారు 17 కేజీల బరువు తగ్గాడని సమాచారం. దీంతో చాలా హుషారుగా సర్ఫరాజ్ కనిపిస్తున్నాడు. ఇటీవల ముంబై టీ20 లీగ్‌లో అతడు మెరుపు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో టెస్ట్ సిరీస్ ద్వారా.. అదిరిపోయే కమ్ బ్యాక్ ఇవ్వాలని భావిస్తున్నాడు. నిజానికి శ్రీలంకతో టెస్ట్ సిరీస్ కోసం సుదర్శన్ రీప్లేస్‌మెంట్‌గా ముగ్గురి మధ్య పోటీ ఏర్పడింది. రుతురాజ్ గైక్వాడ్, షేక్ రషీద్ పేర్లు కూడా వినిపించినా.. స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటాడనే పేరున్న సర్ఫరాజ్ వైపే.. సెలక్టర్లు మొగ్గుచూపించారు. అయితే అతడికి తుది జట్టులో చోటు దక్కుతుందా లేదా అన్నది తేలాల్సి ఉంది. మహమ్మద్ కైఫ్ లాంటి మాజీ ప్లేయర్.. ధ్రువ్ జురెల్ ప్లేసులో ప్లేయింగ్ లెవెన్‌లోకి తీసుకోవాలని సూచించాడు. మరి టీమ్ మేనేజ్‌మెంట్ ఏం ఆలోచిస్తోంది.. అతడికి చోటు దక్కుతుందా.. లేదా అన్నది తేలాల్సి ఉంది.

**శ్రీలంకతో సిరీస్ కోసం భారత జట్టు..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైశ్వాల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రర్, దేవదత్ పడిక్కల్, సారాంశ్ జైన్, ఆకిబ్ నబీ, సర్ఫరాజ్ ఖాన్

## సిరాజ్ కాదు.. భారత జట్టు అస్త్రం ఆ కుర్రాడే..!




వామప్ మ్యాచ్‌లో గెలుపొందిన భారత జట్టు టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతోంది. శ్రీలంక ఎలెవన్ బ్యాటర్ల ముందు తేలిపోయిన మన బౌలర్లు ఏ మేరకు రాణిస్తున్నారు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరో నాలుగు రోజుల్లో గాలేలో మ్యాచ్ ఉండడంతో... లంక బ్యాటర్లను నిలువరించే పేసర్ ఎవరు? అనేది ఆసక్తి రేపుతోంది. ఈ నేపథ్యంలో శ్రీలంక దిగ్గజం పర్వేజ్ మొహరూఫ్ తమ ఆటగాళ్లకు టీమిండియాలోని పొడగరి పేసర్ నుంచి ముప్పు ఉందని తెలిపాడు. టెస్టు సిరీస్‌లో ఆ కొత్త బౌలరే శుభ్‌మన్ గిల్ సేనకు ప్రధాన అస్త్రం అవుతాడని మహరూఫ్ పేర్కొన్నాడు. టెస్టు సిరీస్‌లో ఓవైపు గాయాలు.. మరోవైపు శ్రీలంక ఎలెవన్‌పై భారీగా పరుగులిచ్చుకున్న బౌలర్లు.. భారత జట్టుకు సవాల్‌గా మారనున్నాయి. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో సిరాజ్ నేతృత్వంలోని టీమిండియా బౌలింగ్ దళం ఏమేర రాణిస్తుంది? అనేది చూడాలి. అయితే.. అరంగేట్రం నుంచి ఆకట్టుకుంటున్న గుర్నూర్ బ్రార్ టీమిండియా తరపుముక్క అవుతాడని శ్రీలంక వెటరన్ పర్వేజ్ మహరూఫ్ అన్నాడు. 'పాత బంతితో బుమ్రా రివర్స్ స్వింగ్ రాబట్టగలడు. ఇప్పుడు అతడు దూరమవ్వడం భారత్‌కు ఎదురుదెబ్బే. దాంతో, టీమిండియా వికెట్ తీసే అవకాశాలపై ప్రభావం పడుతుంది. కానీ, సిరాజ్ మంచి బౌలరే. అయితే.. ఈ సిరీస్‌లో ఇండియాకు గుర్నూర్ బ్రార్ కీలకం కానున్నాడు అని నా అభిప్రాయం. అతడు బౌన్స్ రాబట్టగలడు. అతడిలో మంచి పేస్‌తో పాటు కసి కూడా ఉంది. కానీ, అతడు ఇంకా టెస్టులు ఆడలేదు. అయినా సరే .. లంక బ్యాటర్లను గుర్నూర్ ఇబ్బంది పెట్టగలడు. ఇక స్పిన్నర్ల విషయానికొస్తే.. జడేజా, కుల్దీప్.. సుతార్, సరాన్ష్‌లో ఒకరిని ఆడించే అవకాశముంది' అని మహరూఫ్ వెల్లడించాడు. ఆగస్టు 15న గాలే స్టేడియంలో ఆతిథ్య లంకను భారత జట్టు ఢీ కొట్టనుంది.

## పెళ్లి పేరుతో మోసం..
## రేప్ కేసులో ఐపీఎల్ ప్లేయర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్!

**పెళ్లి పేరుతో మోసం చేశాడని వైద్య విద్యార్థిని ఆరోపణ**

**కోల్‌కతా హైకోర్టు ఆదేశాలతో అభిషేక్‌పై చర్యలు**




భారత దేశవాళీ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున మెరుపులు మెరిపించిన యువ వికెట్ కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ తీవ్రమైన లైంగిక దాడి ఆరోపణల్లో చిక్కుకున్నాడు. పెళ్లి పేరుతో తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఓ వైద్య విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీలో పోలీసులు పోరెల్‌ను అరెస్ట్ చేశారు. హుగ్లీలోని ఎమామి సిటీలో అతడిని అదుపులోకి తీసుకుని, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం చించురా న్యాయస్థానంలో హాజరుపరిచారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. 2023 జనవరి నుంచి అభిషేక్ పోరెల్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి, పోరెల్ తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని సదరు విద్యార్థిని ఆరోపించింది. తాము కలిసి విదేశాలకు సైతం వెళ్లామని తెలిపింది. ఏడాది కాలంగా వీరి మధ్య విబేధాలు తలెత్తాయి. ప్రశ్నించిన తనపై దాడి చేసి, బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు తన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ కేసులో పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని బాధితురాలు కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ధర్మాసనం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, నిందితుడైన అభిషేక్ పోరెల్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, అతడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేయాలని జూలై 14న బెంగాల్ పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో పోలీసులు చర్యలు ముమ్మరం చేసి, కీలక ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి పోరెల్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. బెంగాల్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనలతో ఇండియా-ఏ జట్టుకు సైతం ఎంపికైన 23 ఏళ్ల పోరెల్ కెరీర్‌కు ఈ అరెస్ట్ పెద్ద ఎదురుదెబ్బగా మారింది. గతంలో ఈ ఆరోపణలను పోరెల్ ఖండించాడు. అయితే ప్రస్తుతం అతడు పోలీసు కస్టడీలో ఉన్నందున కోర్టు విచారణ ఆధారంగానే ఈ కేసులో తుది తీర్పు వెలువడనుంది. వికెట్ కీపర్ కమ్ లెఫ్టార్మ్ బ్యాటర్ అయిన అభిషేక్ పోరెల్.. ఐపీఎల్‌లో 2023 నుంచి ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడుతున్నాడు. ఇప్పటి వరకు 35 ఐపీఎల్ మ్యాచ్‌లలో 25.63 సగటుతో 769 పరుగులు చేశాడు. అత్యధిక స్కోర్ 65గా ఉంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడిన అభిషేక్ పోరెల్ 27 సగటుతో 108 పరుగులే చేశాడు

# అల్లరి నరేష్ 'రంభ ఊర్వశి మేనక' టీజర్ విడుదల..

### నవ్వులు పంచేందుకు వస్తోన్న టాలీవుడ్ కామెడీ కింగ్!




టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' . చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన నలుగురు కథానాయికలు రాశిసింగ్, విష్ణు ప్రియా, సురభి, ప్రిషా సింగ్ నటిస్తున్నారు. తన వంశ పారపర్యంగా వచ్చిన కోరికల బుక్‌తో భుమి మీదకి రంభ, ఊర్వశి, మేనకలను పిలిచిన అనంతరం జరిగిన పరిణామలు ఏంటి అనేది ఈ సినిమా స్టోరీ.ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ (ూాఅఖుజూబతీఖు ాొబసఱశీం) బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమా పూర్తిగా వినోదాత్మక నేపథ్యంలో రూపొందుతోంది. విడుదలైన టీజర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తూ, అల్లరి నరేష్ మార్క్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని స్పష్టం చేస్తోంది. ఈ చిత్రం సెప్టెంబర్ 04న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# కలెక్షన్లలో కనకరాజు దూకుడు



మెగాహీరో వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా మొదటి వీకెండ్‌లోనే సుమారు రూ. 37 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇక వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చిన మొదటి వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. కఠినమైన 'మండే టెస్ట్'ను ఈ చిత్రం చాలా విజయవంతంగా పాస్ అయింది. విడుదలైన నాలుగో రోజు అయిన సోమవారం ఒక్కరోజే బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవ్వడం విశేషం. దీనివల్ల మొదటి వారపు రోజుల్లోనూ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని స్పష్టమవుతోంది. ఇలాగే కలెక్షన్స్ కొనసాగితే రాబోయే రోజుల్లోనూ థియేటర్లలో ఈ చిత్రం హవా మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇదిలాఉంటే, ఈ సినిమా ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.



# మెగా ఆఫర్ కొట్టేసిందట?

గత ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'.. ఈ ఏడాది సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'.. ఇలా వరుస సంక్రాంతి విజయాలతో పండుగ హీరోయిన్‌గా పేరు గాంచింది హర్యానా అందం మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. ఇదిలావుంటే.. ఓ అపూర్వమైన అవకాశం మీనాక్షి చౌదరి తలుపు తట్టినట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మెగా 158'(వర్కింగ్ టైటిల్) చిత్రంలో మీనాక్షి చౌదరి నటించనున్నదట.అయితే.. ఆమెది హీరోయిన్ పాత్ర కాదని, ఓ అతిథి పాత్రలో ఆమె కనిపిస్తుందని తెలుస్తున్నది. ఈ సినిమా ఫ్లాష్‌బ్యాక్‌లో ఆమె పాత్ర ఉంటుందట. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే మెగాస్టార్ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయని, మాఫియా నేపథ్యంలో ఆయన పాత్ర సాగుతుందని వినికిడి. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# భారీ రన్‌టైమ్‌తో రాబోతున్న యశ్ 'టాక్సిక్'..



సౌత్ ఇండియన్ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' . గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కేజీఎఫ్ సిరీస్ తర్వాత యశ్ నుండి వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన క్రేజ్ ఉంది.తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రానికి 3 గంటల 11 నిమిషాల భారీ రన్‌టైమ్ ఉండబోతున్నట్లు సమాచారం. సినిమా కథాంశం, యాక్షన్ సీక్వెన్స్‌లు మరియు ఎమోషనల్ డ్రామాకు తగినట్లుగా నిడివి కాస్త ఎక్కువగా ఉండొచ్చని, దాదాపు మూడు గంటల పాటు సినిమాను నడిపించేలా దర్శకురాలు ప్లాన్ చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాను ఐమాక్స్ ఫార్మట్‌లలో కూడా విడుదల చేయబోతున్నారు. అయితే ఇందులో విశేషం ఏమిటంటే కన్నడ నుంచి రెండు సినిమాలను (కేజీఎఫ్ 2, టాక్సిక్) ఐమాక్స్ ఫార్మట్‌లో విడుదల చేసిన ఏకైక హీరోగా యష్ రికార్డులకెక్కాడు.

# నాగార్జున 'నాగ్100' నుంచి బిగ్ అప్డేట్..

### -ఆగస్టు 29న ఎలాంటి సర్‌ప్రైజెస్ రానున్నాయి..!



అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున 100వ చిత్రం 'నాగ్100'పై ఎట్టకేలకు ఓ కీలక అప్డేట్ బయటకు వచ్చింది. కొంతకాలంగా ఈ ప్రాజెక్ట్ గురించి రకరకాల వార్తలు, ఊహాగానాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ కార్యక్రమాలను ప్రారంభించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నాగార్జున పుట్టినరోజు ఆగస్టు 29. ఈ ప్రత్యేక రోజునే 'నాగ్100' ప్రమోషన్లకు శ్రీకారం చుట్టనున్నట్లు తాజా సమాచారం. ఇందులో భాగంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు ప్రత్యేక బర్త్‌డే గ్లింప్స్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయనున్నారని తెలుస్తోంది.ఇప్పటివరకు 'నాగ్100'కు సంబంధించి అధికారికంగా పెద్దగా వివరాలు బయటకు రాకపోవడంతో.. ఆగస్టు 29న విడుదల కానున్న అప్డేట్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. నాగార్జున 100వ సినిమా కావడంతో ఈ ఫస్ట్ లుక్ ఎలా ఉండబోతుందనే చర్చ కూడా మొదలైంది. నాగార్జున తన కెరీర్‌లో ఎన్నో విభిన్నమైన పాత్రలు, ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో అత్యంత ప్రత్యేకమైన మైలురాయిగా నిలవబోతున్న 100వ చిత్రం కావడంతో 'నాగ్100'పై సహజంగానే అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా కథ, కాన్సెప్ట్, నాగార్జున పాత్రతో పాటు భారీ తారాగణం ఉంటుందా? అనే విషయాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే ఇప్పటివరకు మేకర్స్ మాత్రం ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. 'నాగ్100' చిత్రానికి రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. 100వ సినిమా వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ఆయన ఎలా తెరకెక్కించబోతున్నారనే ఆసక్తి కూడా ఉంది. నాగార్జున ఇమేజ్‌కు తగ్గట్టుగా కథను ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ గోప్యంగా ఉంచుతున్నారు. ముఖ్యంగా సినిమా జానర్, నాగార్జున లుక్, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్ వంటి అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్న ఫస్ట్ లుక్ పోస్టర్, బర్త్‌డే గ్లింప్స్‌తో 'నాగ్100' ప్రపంచాన్ని తొలిసారి ప్రేక్షకులకు పరిచయం చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్. ఈ అప్డేట్‌తో సినిమాపై ఉన్న ఊహాగానాలకు కొంతమేర తెరపడే అవకాశం ఉంది.